
మాట్లాడుతున్న అసెంబ్లీ అభ్యర్థి వెంకటేష్


వీర తిలకం దిద్దుతున్న తల్లి సరస్వతి, ఎమ్మెల్యే బలరాం


విజయీభవా.. వెంకటేష్‌కు హారతి ఇస్తున్న కుటుంబ సభ్యులు


మనవడా.. నీవే ఎమ్మెల్యే అంటున్న వృద్ధురాలు..


ప్రజలకు అభివాదం చేస్తున్న కరణం వెంకటేష్, గీత దంపతులు

జెండా పాతేస్తాం.. అంతే !

- కరణం వెంకటేష్ నామినేషన్‌లో జన సునామీ
- కిక్కిరిసిన చీరాల రోడ్లు.. ఎటు చూసినా జనమే
- వెంకటేష్ వెంట స్వచ్ఛందంగా నడిచిన వేలాదిమంది
- దారి పొడవునా జన నీరాజనాలు


చేనేతలు ఇచ్చిన బహుమతులను చూపిస్తున్న వెంకటేష్


అభ్యర్థి కరణం వెంకటేష్‌కు గొర్రెపిల్ల, గొంగళిని బహూకరిస్తున్న యాదవులు


ఇచ్చిన మాట.. అనే పాటకు స్టెప్పులేస్తున్న యువతులు


వైఎస్సార్ సీపీ అభ్యర్థి వెంకటేష్ నామినేషన్‌లో జనజాతరను తలపిస్తున్న వీధులు


రామకృష్ణాపురం నుంచి ప్రారంభమైన ర్యాలీలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

చీరాల: అది ముందుగా అనుకున్న బహిరంగ సభ కాదు.. ఒక్క పిలుపుతో చీరాల ప్రజానీకం మొత్తం కరణం కుటుంబం వెంట నడిచింది. ఒకరు కాదు.. వంద కాదు.. వేలాది మంది ప్రజలు స్వచ్ఛందంగా కరణం వెంకటేష్ నామినేషన్‌కు వెల్లువలా పోటెత్తారు. నడినెత్తిన సూరీడు సుర్రుమంటున్నా.. సంతోషంతో నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. బుధవారం వైఎస్సార్ సీపీ అభ్యర్థి కరణం వెంకటేష్ నామినేషన్‌లో జన సునామీ కనిపించింది. గతంలో ఎన్నడూలేని విధంగా చీరాల రోడ్లన్నీ వైఎస్సార్ సీపీ, నాయకులు కార్యకర్తలు, ప్రజలతో కిక్కిరిశాయి. వెంకటేష్ వెంట స్వచ్ఛందంగా వేలాది మంది తండోప తండాలుగా తరలివచ్చారు. జనం నీరాజనాలుతో జేజేలు పలికారు. బుధవారం ఉదయం రామకృష్ణాపురంలోని ఎమ్మెల్యే గృహం నుంచి తల్లిదండ్రులు ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, సరస్వతిలు ఆశీర్వదించారు. వెంకటేష్ సోదరిమణులు సుధారాణి, శాంతి ప్రియ, భార్య కరణం గీత గుమ్మడికాయతో దిష్టితీయగా గీత వీరతిలకం దిద్దారు.

ఊరూ వాడా.. వీధివీధినా ఏకమైన జనం..

నామినేషన్ ర్యాలీ రామకృష్ణాపురంలోని ఎమ్మెల్యే నివాస గృహం నుంచి సాల్మన్ సెంటర్, ప్రసాద్ థియేటర్, ముంతావారి సెంటర్, గడియార స్తంభం సెంటర్, ముక్కోణం పార్క్ అంబేడ్కర్ విగ్రహం సెంటర్, మున్సిపల్ ఆఫీస్ వరకు జరిగింది. ఉదయం 10.45 నిమిషాలకు ఇంటి నుంచి నామినేషన్‌కు అశేష జనవాహిని మధ్య ర్యాలీని ప్రారంభించారు. కేరళ సంప్రదాయ చెండా మేళం, డీజేలు, సన్నాయి మేళాలు, తప్పెట్ల హోరు, వైఎస్సార్ సీపీ జెండాలతో జన హోరుతో ర్యాలీ సాగింది. పట్టణంలోని ఆంజనేయ స్వామి గుడిలో ప్రత్యేక పూజలు, వినాయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. దారి పొడవునా వేలాదిమంది ప్రజలు జై జగన్.. జై కరణం నినాదాలతో చీరాల హోరెత్తింది. రామకృష్ణాపురం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు నిర్వహించిన నామినేషన్ ర్యాలీకి నియోజకవర్గంలోని చీరాల మండలంలోని దేవినూతల నుంచి వేటపాలెం మండలంలోని పందిళ్లపల్లి గ్రామ వరకు 24 గ్రామ పంచాయతీల్లోని వేలాది మంది ప్రజలతో పాటుగా, చీరాల మున్సిపాలిటీలోని 33 వార్డుల్లో నుంచి తండోప తండాలుగా వచ్చారు. నామినేషన్‌కు వచ్చిన అశేష ప్రజలు, కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు లేకండా దారిపొడవునా మజ్జిగ, మంచినీటి వసతి ఏర్పాటు చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసులు ఏర్పాట్లు చేశారు.

డీజేలతో పాటల హోరు .. పాదం కదిపిన జనం

'జెండలు జతకట్టడమే మీ అజెండా..
జన గుండెలో గుడికట్టడమే జగను అజెండా/
భళిరా.. భళి.. భళి.. భళిరా..
పులివెందులలో పుట్టిందా ఆ.. పులిరా'

అనే పాటకు చిన్నపెద్దా, యువత అన్న తేడా లేకుండా స్టెప్పులు వేస్తూ జనం ఊర్రూతలూగారు. కేరళ వాయిద్యాలతో ర్యాలీ మారుమ్రోగింది. మహిళలు, వృద్ధులు సైతం ఎండని లెక్కచేయకుండా నామినేషన్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు, పర్చూరు వైఎస్సార్ సీపీ అభ్యర్థి యడం బాలాజీ, మాజీ ఎంపీ చిమటా సాంబు, మాజీ ఎమ్మెల్యే ఆదెన్న, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, దేవాంగ కార్పొరేషన్ చైర్మన్ బీరక సురేంద్ర, వైస్ చైర్మన్ జైసన్‌బాబు, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కర్నేటి వెంకటప్రసాద్, డాక్టర్ హైమా సుబ్బారావు, మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీలోని వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

హనిమిరెడ్డి గెలుపు కోసం సమష్టి కృషి


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న చిన హనిమిరెడ్డి, అంజిబాబు


కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న హనిమిరెడ్డి

- రజకుల సంఘం రాష్ట్ర అధక్షుడు అంజిబాబు
- వైఎస్సార్ సీపీకి మద్దతు తెలిపిన నాయకులు

అద్దంకి రూరల్: వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి గెలుపు కోసం కృషి చేస్తామని రజకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పీ. అంజిబాబు పేర్కొన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో రజకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీల అభివృద్ధి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి వల్లే సాధ్యపడుతుందన్నారు. అనంతరం అసెంబ్లీ అభ్యర్థి చిన హనిమిరెడ్డి మాట్లాడుతూ జగనన్న పాలనలో అన్నివర్గాల వారు ఆనందంగా ఉందన్నారు. రాబోయో ఎన్నికలో వైఎస్సార్ సీపీ ఘనవిజయం సాధిస్తుందన్నారు. 22వ తేదీన జరిగిన నామినేషన్ కార్యక్రమం అద్దంకిలో వైఎస్సార్ సీపీ గెలుపునకు తొలిమెట్టు అన్నారు. మూడుసార్లు గెలిచిన రవికుమార్ చేసిన అభివద్ధి శూన్యం అన్నారు. తనకు ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధికిలో నంబర్ వన్ స్థానంలో అద్దంకిని నిలబెడతాన్నారు. కార్యక్రమంలో రజకసంఘ నేతలు, స్థానిక వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

10 కుటుంబాలు వైఎస్సార్ సీపీలోకి చేరిక

అద్దంకి పట్టణంలోని 13 వవార్డుకు చెందిన వుప్పతాళ్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో చిన హనిమిరెడ్డి సమక్షంలో 10 వడియరాజులు కుటుంబాలు పార్టీలో చేరారు. వీరందరికి పార్టీ కండువాలు వేసి హనిమిరెడ్డి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ గెలుపు కోసం కృషిచేయాలని కోరారు.

మూకుమ్మడిగా వలంటీర్ల రాజీనామాలు


పర్చూరు వైఎస్సార్ సీపీ అభ్యర్థి బాలాజీని కలిసిన పూనూరు వలంటీర్‌లు


రాజీనామాలు చేసి అభ్యర్థి బాలాజీని కలిసిన చినగంజాం-1 వలంటీర్‌లు

పర్చూరు (చినగంజాం): యద్దనపూడి మండలం పూనూరు గ్రామానికి చెందిన 24 మంది గ్రామ వలంటీర్‌లు మూకుమ్మడిగా రాజీనామాలు చేశారు. బుధవారం గ్రామ వలంటీర్‌లు తమ రాజీనామాలను పూనూరు గ్రామ కార్యదర్శి నగేష్‌కు అందజేశారు. పూనూరు గ్రామ సర్పంచ్ మేకా సుధాకర్, మండల యువజన విభాగం అధ్యక్షుడు బొబ్బేపల్లి శ్రీకాంత్ ఆధ్వర్యంలో వారు తమ రాజీనామాలను అందజేసిన అనంతరం చీరాల క్యాంపు కార్యాలయంలో పర్చూరు వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీని కలిసి తమ మద్దతును తెలియజేశారు. చిన గంజాం 1 సచివాలయ పరిధిలోని ఐదుగురు గ్రామ వలంటీర్‌లు మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఆసోది బ్రహ్మానందరెడ్డి, పెదగంజాం 2 ఎంపీటీసీ యల్లావుల తిరుపతిరావు ఆధ్వర్యంలో వారు తమ రాజీనామాలు సమర్పించి బాలాజీని కలిసి తమ మద్దతును తెలియజేశారు. ఇటీవల టీడీపీలో చేరిన చినగంజాం పంచాయతీ వార్డు సభ్యుడు మార్పు సుకుమార్ తిరిగి వైఎస్సార్ సీపీలోకి చేరారు. ఆయనకు అభ్యర్థి బాలాజీ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో అక్కల కోటిరెడ్డి, గ్రామ వలంటీర్‌లు పాల్గొన్నారు.

మాలలంతా వైఎస్సార్ సీపీకి
అండగా ఉంటాం


సునీల్

చినగంజాం: రాబోయే ఎన్నికల్లో మాలలంతా వైఎస్సార్ సీపీ అండగా ఉండి.. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని తిరిగి గెలిపించుకునేందుకు కృషి చేస్తామని బాపట్ల జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు మేడికొండ సునీల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర రాజకీయ ముఖచిత్రాన్ని మార్చివేసిన సీఎం జగన్‌మోహనరెడ్డి బస్సు యాత్ర ఒక విజేత సాధించిన విజయయాత్ర అని ఆయన అన్నారు. రాష్ట్రంలోని 21 జిల్లాల్లో నిర్వహించిన మేమంతా బస్సు యాత్రకు ప్రజలు తమ బతుకుల్లో వెలుగులు నింపిన నేతకు అడుగడుగునా నీరాజనాలు పలికారని అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో 600 హామీలు ఇచ్చి చివరికి కనబడకుండా చేసిన చంద్రబాబును నమ్మే స్థితిలో ఎవరూ లేరన్నారు. రెండేళ్ల పాటు కరోనాతో రాష్ట్ర ప్రజలు అల్లాడితే ఇప్పుడు గ్రూపులు కట్టిన ముగ్గురు అప్పుడు ఏమైపోయారని ఆయన ప్రశ్నించారు. ఈ విషయాలన్నీ ప్రజలు గమనించాలని కోరుకుంటూ మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు సత్తా యోనారాజు ఆధ్వర్యంలో మాలలంతా వైఎస్సార్ సీపీకి అండగా నిలిచి తిరిగి గెలిపించుకోవాలని అన్నారు.

జోరుగా హనిమిరెడ్డి ప్రచారం


ఎన్నికల ప్రచారంలో మహిళలకు అభివాదం చేస్తున్న హనిమిరెడ్డి

అద్దంకి: వైఎస్సార్ సీపీ అద్దంకి అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి ప్రచారంలో దూసుకెళ్తున్నారు. మండలంలోని విప్పర్లవారిపాలెం, బలరామకృష్ణాపురం కాలనీలో బుధవారం రాత్రి ఎన్నికల ప్రచార కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో గడప గడపకు తిరుగుతూ జగనన్న ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను గురించి లబ్ధిదారులకు వివరిస్తూ, ప్రజలతో మమేకం అవుతూ మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి రాష్ట్ర సీఎంగా మళ్లీ జగనన్నను అద్దంకి ఎమ్మెల్యే నన్ను, ఎంపీగా నందిగం సురేష్‌ను గెలిపించాలని గ్రామస్తులను కోరారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు, మండల పార్టీ కన్వీనర్, మండల జేసీఎంస్ ఇన్‌చార్జి, ఎంపీటీసీలు, సర్పంచ్లు, వివిధ హోదాల్లో ఉన్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల దాతృత్వం


భోజనశాల, కాన్ఫరెన్స్ హాలును ప్రారంభిస్తున్న శ్రీనివాసరావు

యద్దనపూడి: పాఠశాల అభివృద్ధికి పూర్వవిద్యార్థుల చేయూత అభినందనీయమని హెచ్‌ఎం రాఘవరెడ్డి అన్నారు. మండలంలోని అనంతవరంలోని కొల్లా వీరవసంతరావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 2015 విద్యా సంవత్సరానికి చెందిన పూర్వవిద్యార్థులు పాఠశాలలో నిర్మించిన అదనపు తరగతి గదుల్లో బెస్ట్ రూమర్స్ యూఎస్‌ఏ వారు రూ.1.60 వేల వ్యయంతో గదులను ఆధునికీకరించి విద్యార్థులకు భోజనశాల, కాన్ఫరెన్స్ హాలుగా మార్చారు. దీనికి వింజనంపాడు ఎస్‌ఆర్‌ై తూబాటి కిషోర్ ఆర్థిక సాయం చేయగా వింజనంపాడు వాస్తవ్యులు సాధినేని శ్రీనివాసరావు చేతులమీదుగా బుధవారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులకు మేలు కలుగజేయాలన్నదే మాఉద్దేశమన్నారు. కార్యక్రమంలో పాఠశాల పూర్వవిద్యార్థుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు తుర్లపాటి శ్రీనివాస్, హరిదాసుల శ్రీనివాసరావు, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అభినందనలు

కారంచేడు: వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీ నామినేషన్‌కు తరలివచ్చిన అశేష జనవాహిని, కార్యకర్తలకు ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మండలంలోని కారంచేడు, కుంకలమర్రు, దగ్గుబాడు, స్వర్ణ గ్రామాలతో పాటు, జరుబులవారిపాలెం, నాయుడువారిపాలెం, పోతినవారిపాలెం, ఆదిపూడి, యర్రంవారిపాలెం, తిమిడెదపాడు, రంగప్పనాయుడువారిపాలెం, కేశవరప్పాడు, కొడవలివారిపాలెం, స్వర్ణపాలెం, రంగప్పనాయుడువారిపాలెం గ్రామాల నుంచి వేలాదిగా కార్యకర్తలు రావడం అభినందనీయమన్నారు. కార్యకర్తలు స్వచ్ఛందంగా తరలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ఎంపీపీ కృతజ్ఞతలు తెలిపారు.

కృషి, పట్టుదలతో లక్ష్యసాధన

చీరాల రూరల్: మనం చేస్తున్న కృషి, పట్టుదలలే మన లక్ష్య సాధనకు దోహదం చేస్తాయని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. స్థానిక సెయింట్ మార్క్స్ లూథరన్ జూనియర్ కళాశాలలో ఏపీపీఎస్సీ గ్రూప్–2 మెయిన్స్ పరీక్ష కోసం ఉచిత శిక్షణా తరగతులను ఎమ్మెల్సీ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిలబస్‌పై అవగాహన కలిగి ఉండి మూడు నెలలపాటు ఎంతో క్రమ శిక్షణతో కష్టపడి చదివినట్లయితే లక్ష్యాన్ని చేరుకోవడం చాలా సులువు ఉంటుందని చెప్పారు. చీరాల వంటి ఈ ప్రాంతంలో అభ్యర్థుల ప్రయోజనం కోసం గ్రూప్–2 ఉచిత శిక్షణా తరగతులు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆయన కళాశాల యాజమాన్యాన్ని అభినందించారు. అలానే గ్రూప్–2 మెయిన్స్ సిలబస్, ముఖ్యమైన పుస్తకాలను గురించి ఆయన అభ్యర్థులకు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ ఇస్సర్ల బాబురావు, డాక్టర్ బి. శ్యామ్‌సుందర్ రాజు, కళాశాల కరస్పాండెంట్ శీలం విద్యా సాగర్, నిర్వహకులు పాల్గొన్నారు.

డెంగీ కేసు నమోదు

వేటపాలెం: దేశాయిపేట పంచాయతీ విఘ్నేశ్వర కాలనీలో డెంగీ కేసు నమోదైయింది. బుధవారం కాలనీలో వైద్య సిబ్బంది ఇంటింటికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది ప్రత్యేక శానిటేసన్ నిర్వహించారు. పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసరావు మాట్లాడుతూ కాలనీకి చెందిన పి వెంకట దుర్గాప్రసాద్ యువకుడు ఇటీవల సొంత పనిపై రేపల్లె వెళ్లినట్లు తెలిపారు. ఆ యువకుడికి అక్కడ జ్వరం రావడంతో గుంటూరు వైద్యశాల్లో పరీక్షలు చేయించుకోగా డెంగీ లక్షణాలు బయటపడ్డాయి. సమాచారం అందడంతో కాలనీలో వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి ప్రజలకు డెంగీ లక్షణాలు, తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. కాలనీలో పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో హెచ్‌ఈఓ శేషుబాబు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.